వీధి కుక్కల వీరంగం

- బయటకెళ్లాలంటే జంకుతున్న జనం
- వాహనదారులను వెంబడించి దాడికి దిగుతున్న వైనం
- మూడు నెలల వ్యవధిలో జగ్గసాగర్ పీహెచ్‌సీకి వంద మందికిపైగా బాధితులు

మెట్‌పల్లిరూరల్/రాయికల్: జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో ఎప్పుడు దాడి చేస్తాయోనన్న భయంతో ప్రజలు జంకుతున్నారు. వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. రోజురోజుకూ కుక్కల బెడద పెరిగిపోవడంతో కుక్కకాటుకు గురైన వారు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కుక్కల బెడదను కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న బాధితుల సంఖ్య..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో చాలామంది కుక్కకాటుకు గురవుతున్నారు. కొందరు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుండగా, ఇంకొందరు జగ్గసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. జగ్గసాగర్ పీహెచ్‌సీకి మూడునెలల వ్యవధిలో కుక్కకాటుకు గురైన బాధితులు వంద మందికి పైగా రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జగ్గసాగర్, ఆత్మనగర్, ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్, కొండ్రికర్ల, కోనరావుపేట గ్రామాల నుంచి ఆరోగ్య కేంద్రానికి కుక్కకాటుకు గురైన బాధితులు రోజూ ఇద్దరు నుంచి ముగ్గురు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

నియంత్రణపై నిర్లక్ష్యం..

వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుక్కల సంతతి పెరగకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ద్వారా నియంత్రణకు చర్యలు చేపట్టాలి. కానీ అలాంటి ప్రక్రియ ఎక్కడ కూడా లేకపోవడంతో కుక్కల బెడద పెరిగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.


జగిత్యాలలో కుక్కల గుంపు


భూమేశ్

మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌కు చెందిన భూమేశ్‌పై ఇటీవల వీధికుక్క దాడిచేసింది. పని నిమిత్తం బయటకు వెళ్లిన అతడిని గాయపర్చడంతో వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకుంటున్నాడు. ఇలా ఏదో ఓ చోట వీధికుక్కలు దాడికి దిగుతున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి.

రాయికల్ పట్టణంలో..

రాయికల్ మున్సిపాలిటీలో కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వీధుల వెంట స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలోని చికెన్ సెంటర్ల వద్ద వ్యర్థ పదార్థాల కోసం గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. మున్సిపాలిటీలోని గాంధీచౌక్, మాదిగకుంట, శివాజీ ఏరియా, ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్, సర్కారు దవాఖానా, నాగారం వాడలో వీటి బెడద ఎక్కువ కావడంతో ప్రజలు జంకుతున్నారు. ఇటీవల పట్టణంలోని నాగారంవాడకు చెందిన వృద్ధురాలు, ఓ చిన్నారితో పాటు 10 మంది వరకు కుక్కకాటు బారినపడ్డారు.


రాయికల్ పట్టణంలో వీధి కుక్కలు

అందుబాటులో వ్యాక్సిన్



కుక్కకాటు బాధితులకు చికిత్స అందిస్తున్నాం. ఆరోగ్య కేంద్రంలో రెబీస్ నివారణ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. బాధితులు గాయమైన చోట వెంటనే మొదట సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వీలైనంత త్వరగా ఆరోగ్య కేంద్రానికి చేరుకొని చికిత్స చేయించుకోవాలి. కుక్కకర్చిన మొదటి రోజు, 3,7, 21వ రోజుల్లో మొత్తం నాలుగు సార్లు క్రమం తప్పకుండా రేబీస్ నివారణ వ్యాక్సిన్ తీసుకోవాలి.

– అంజిత్‌రెడ్డి, మండల వైద్యాధికారి, మెట్‌పల్లి

గుంపుగా వస్తున్నాయి..



రాయికల్ మున్సిపాలిటీలో ఉదయం, రాత్రి వేళ కుక్కలు గుంపుగా వస్తుండడంతో ఆరుబయటకు చిన్నారులు ఒక్కరు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. వ్యక్తులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి.

– రాజు, రాయికల్

మరోచోటికి తరలిస్తాం



రాయికల్ పట్టణంలో కుక్కల స్వైర విహారం ఎక్కువవుతుందని మా దృష్టికి వచ్చింది. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం మాకు లేకపోవడంతో మరో చోటకు తరలించే ప్రయత్నం చేస్తాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలోని 33/11 కేవీ ఫీడర్ చానల్‌లో చెట్ల కొమ్మలు తొలగించనుండటంతో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ తెలిపారు. చల్‌గల్ సెక్షన్ పరిధిలో చల్‌గల్, లింగంపేట, అంతర్గాం, ఒడ్డెరకాలనీ, హస్నాబాద్, చెర్లపల్లి, మోరపల్లి, తాటిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

పొరండ్ల 33/11 కేవీ పరిధిలో..

జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారంగాపూర్ పరిధిలో..

సారంగాపూర్: మండలంలోని ఐదు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. సారంగాపూర్ సబ్‌స్టేషన్‌కు వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలను తొలగించడం కారణంగా సారంగాపూర్, నాయికపుగూడెం, బట్టపల్లి, పోతారం, గణేశ్‌పల్లి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు పెగడపల్లిలో మంత్రి పర్యటన

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న తెలిపారు. ఎల్లాపూర్, వెంగళాయిపేట, నర్సింహునిపేట, సుద్దపల్లి, గ్రామాల్లో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం


దాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని రాజారాంతండా గ్రామంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ఇద్దరు విరాళం అందించినట్లు సర్పంచ్ లవుడ్యా సరిత శనివారం తెలిపారు. భుక్యా తిరుపతి రూ.1 లక్ష, లవుడ్యా చందునాయక్ రూ.50 వేలు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. దాతలను గ్రామస్తులు సన్మానించారు.

నియామకం


మోహన్

మల్యాల: అఖిల భారత అయ్యప్ప జిల్లా ప్రచార కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన గుండేటి మోహన్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాజ్‌దేశ్‌పాండే స్వామి నియమించారు. ఈసందర్భంగా మోహన్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన అయ్యప్ప దీక్షా పరులకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి భక్తి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తనవంతు సేవలందిస్తానని తెలిపారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్


సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మెట్‌పల్లి: మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఉజ్జగిరి శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం పలువురు సభ్యులు ఆయనను సన్మానించారు. సంఘ సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి


పీఆర్టీయూలో చేరుతున్న మల్లారెడ్డి

జగిత్యాల: పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా జాబితాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కన్నవేని మల్లారెడ్డి నియమితులయ్యారు. తపస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న మల్లారెడ్డి పీఆర్టీయూ సంఘం పనితీరు మెచ్చి ఆ సంఘానికి రాజీనామా చేసినట్లు ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. ఆయన నియామకంపై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినపల్లి ఆనందరావు అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన పేట భాస్కర్


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యతో పేట భాస్కర్

కోరుట్ల: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ కార్య నిర్వాహక అధ్యక్షుడు పేట భాస్కర్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. రాష్ట్రంలో కుల వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించేలా సదస్సులు ఏర్పాటు చేయాలని కోరినట్లు భాస్కర్ తెలిపారు. జేఏసీ ఉపాధ్యక్షుడు బత్తుల శంకర్ ఉన్నారు.

ఈ పంచాయతీ ఆపరేటర్ల సమ్మె


సమ్మెలో పంచాయతీ ఆపరేటర్లు

జగిత్యాలటౌన్: సమస్యలు పరిష్కరించి పేస్కేలు అమలు చేయాలని ఈ పంచాయతీ ఆపరేటర్లు చేపట్టిన శాంతియుత సమ్మె శనివారం 9వ రోజుకు చేరింది. సమ్మెకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సంఘీభావం తెలిపారు. అనంతరం రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి, డీపీఎం సాంబశివ మాట్లాడుతూ, 13 ఏళ్లుగా సేవలందిస్తున్న ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీ ఆపరేటర్లు జిల్లావ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్యబీమాతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకిస్తున్న అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గొట్టి రమేశ్, నాయకులు పల్లికొండ సంతోష్‌కుమార్, గంగమల్లు, వెంకటరమణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మా గోడు పట్టదా?


కోరుట్ల: నందిచౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మల్లాపూర్/కోరుట్ల/మెట్‌పల్లి/రాయికల్: తమ గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బతుకమ్మ, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను కలిసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ధర్నా చేపట్టారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, నాయకులు సంఘీభావం ప్రకటించారు. లయ, శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న, రమ, వసంత, లత, శాంత, మమత, రాజేశ్వరి, మనమ్మ, శారద, నవ్య, చంద్రమ్మ, లక్ష్మీ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోరుట్ల పట్టణంలో నందిచౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, నాయకులు కొంక భాగ్య, సంగం పద్మ, చుక్క లక్ష్మీరాజం, కోయల్‌కార్ అంకుష్, బెక్కం లత, రాధ, దశరథం తదితరులు పాల్గొన్నారు. ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క కోరారు. మెట్‌పల్లి పట్టణంలో సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపారు. రాయికల్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, ఆదివాసి రాష్ట్ర నాయకుడు ఆత్రం రవీందర్ మద్దతు పలికారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇప్పపెల్లి గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామస్తులు శనివారం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిశారు. ఎమ్మెల్యే సిఫారస్ లేటర్ ఉందని గ్రామశివారులోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని వివరించారు. ఈసందర్భంగా తాను ఎవరికీ లెటర్ ఇవ్వలేదని ఎమ్మెల్యే చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

పకడ్బందీగా బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలి

ఇబ్రహీంపట్నం/మల్యాల/మెట్‌పల్లి: బతుకమ్మ చీరలను లబ్ధిదారులకు పకడ్బందీగా పంపిణీ చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కోరారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు. మల్యాల మండలం ఒబులాపూర్‌లో సర్పంచ్ పొన్నం సరోజనమల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ బూసి పద్మ, కార్యదర్శి అజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని రాంనగర్‌లో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. నాయకులు భీమనాతి సత్యం, రవీందర్, విజయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో శనివారం ఇద్దరు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య చెక్కులు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

గొల్లపల్లి: మండలంలోని రాపల్లి గ్రామంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు పలు అభివృద్ధి పనులకు శనివారం సర్పంచ్ నల్ల శ్యామ్ భూమిపూజ చేశారు.

వైకుంఠ రథం అందజేత

మేడిపెల్లి: భీమారం మండలం దేశాయిపేటలో శనివారం చెన్నమనేని వికాస్‌రావు–దీప గ్రామస్తులకు వైకుంఠ రథాన్ని అందజేశారు. అనంతరం ఆశా కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు.మేడిపెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొప్పెర లింగారెడ్డి తండ్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అజిత్ రావు తండ్రి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు.

పోస్టుకార్డులతో నిరసన

ధర్మపురి: టీఎస్‌పీఎస్సీ తప్పిదాలకు నిరసనగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని గ్రూప్ 1,2,3,4 అభ్యర్థులు శనివారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు.

చేప పిల్లలు పంపిణీ

కథలాపూర్: మండలంలోని మత్స్యకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను ఎంపీపీ జవ్వాజి రేవతి శనివారం పంపిణీ చేశారు. మండలంలోని 30 కుంటలు, చెరువుల్లో చేపలు పెంచడానికి వీలుగా 3.62 లక్షల చేప పిల్ల లను మత్స్యకారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు సన్మానం

బుగ్గారం: మండల కేంద్రానికి చెందిన మసర్తి జీవన్, మాదాసు హరీశ్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో శనివారం అభ్యర్థులను శాలువాలతో సన్మానించారు.

ఎమ్మెల్సీ పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్లాపూర్: మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ నాయిని రాధ, కుటుంబసభ్యులను శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. రాధ భర్త నాయిని అంజయ్య గత ఆగస్టులో తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సీనియర్ నాయకుడు అంజయ్య అకాలమరణం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ఆయన వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, నాయకులు తోట సంతోష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై కోరుట్లలో మంత్రి హరీశ్‌రావు ప్రారంభించిన ఆసుపత్రిలోనే చర్చకు బీఆర్‌ఎస్ నాయకులు రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన పట్టణంలో మాట్లాడారు. పూర్తి నిర్మాణం కాని ఆసుపత్రిని మంత్రి ప్రారంభించారని, అదే ఆసుపత్రిలో కూర్చొని చర్చిస్తే బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుస్తుందన్నారు. మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కోరుట్లకు చేసిన అభివృద్ధి, ప్రస్తుత ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన అవినీతిపై చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయని, అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం


మాట్లాడుతున్న నవీన్

పెగడపల్లి: బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెలా నవీన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వశక్తికిరణ్ అభియాన్‌లో భాగంగా బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ కుటుంబంతో పాటు ప్రభుత్వంలో ఉన్న పాలకులు దోచుకుని, దాచుకుని రాజభోగం అనుభవిస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలంటే బీఆర్‌ఎస్‌ను తరమికొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు మోహన్‌రెడ్డి, బాబు, అంజన్న, అనిల్ పాల్గొన్నారు.

పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్స్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి చాటేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. అనంతరం గౌడ కులసంఘానికి రూ.50లక్షల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఎస్సై నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

ఇబ్రహీంపట్నం: పొలాలు పొట్ట దశకు వచ్చాయి, యూరియా దొరకడం లేదు, పక్క జిల్లాల నుంచి బ్లాక్‌లో కొంటున్నాం, యూరియా కొరత వెంటనే తీర్చాలని రైతులు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును వేడుకున్నారు. మండలంలోని వర్షకొండలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.7 లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఎర్దండి, ఇబ్రహీంపట్నంలో హెల్త్ సబ్‌సెంటర్ల భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యూరియా కొరతపై ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపికి ఫోన్ చేశారు. యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని సూచించారు. డబ్బా గ్రామానికి చెందిన 53 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీవో కృపాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, సర్పంచు దొంతుల శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే మెట్‌పల్లి అభివృద్ధి

మెట్‌పల్లి: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కృషితో మెట్‌పల్లి మున్సిపాలిటీ అన్ని విధాలుగా ఎంతో అభివృద్ధి చెందిందని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం పాలకవర్గ సభ్యులు, అధికారులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. చైర్‌పర్సన్ సుజాత, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డే హంగామా



నృత్యం చేస్తున్న నలంద విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చే వివిధ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో సఫలీకృతులు కావాలి

లక్ష్య సాధనలో సఫలీకృతులు కావాలని రామకృష్ణ కళాశాల చైర్మన్ రామకృష్ణ అన్నారు. శనివారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశసేవలో కూడా ముందుండాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ వెంకటరాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ కాలేజీ విద్యార్థుల డ్యాన్స్

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, ఆలూరు గ్రామాల్లో కేసీ ఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచులు సామల్ల లావణ్య, భాగ్యలక్ష్మి, ఎంపీవో సుష్మ, నాయకులు ఆదిరెడ్డి, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.